# "నిత్య ప్రయాణం"

"ఏయ్...తీయరా బండిని.."

"ఎల్లిపోతానయ్యా, సవారీ వస్తున్నాది"

"చెప్తే అర్థం కాదురా? తీయ్"

"తీస్తున్నా సామీ, జర్రాగు...ఇదుగో. ఇప్పుడే తీస్తా"

"తీస్తా అంటవ్, మళ్ళ నిలబడ్డావ్"

ఠప్.

"నడు స్టేషన్‌కి"

"కొట్టకు దొరా నీ కాల్మొక్తా...బాంచన్..."

"రిక్షా తీయమంటే సణుగుతావేందిరో...నడునీ... మొదలే మినిష్టరొస్తాండు"

ఠప్.

"కొట్టకు దొరా, అదుగో ఆ అమ్మే గిప్పుడే వస్తనని ఆ దుకాన్ల పోయింది, బోణీ ఇదే దొరా, ఒక్క నిముషం ఆగు, గా అమ్మ రాంగానే వెళ్ళిపోతా."

"అరే చెప్తే వినవేందిరా...నడు...నడు...గిట్ల నువ్ వినవ్‌గానీ... అమీన్‌సాబ్ చూస్తాండు..నేనెక్కుతా నడు.. నడు..."

ఠప్...ఠప్.

"యాడికి దొరా?" బాధా మిళిత స్వరం.

"స్టేషన్‌కు బే... గా దొంగతనం కేసులో నిన్నిరికిస్తే అదాలత్‌ల ఆర్నెల్లు పడతాది. బొక్కలో కూకుంటే గప్పుడు మంచిగుంటది నడువ్ నీయవ్వ"

ఠప్.

"కొట్టకు దొరా, నీ కాల్మొక్తా బిడ్డలున్నోడ్ని, వదిలేయ్ దొరా వదిలేయ్" ప్రాధేయ స్వరం.

"అట్లెట్ల వదుల్తా? గప్పుడు రోడ్లపొంటి బండి తీయమంటే విన్నావురా, గిట్ల మంత్రివస్తాండు అడ్డం తీయుబే అంటే విన్నావు?" అధికార స్వరం, పులికి మేకదొరికిన సంబరం.

"తప్పయిపోయింది దొరా వదిలేయ్"

"పైసలున్నాయిరా జేబ్‌ల" అధికార స్వరం కాస్త తగ్గింది.

"మా దగ్గరేముంటయ్ దొరా, పదే ఉంది."

"తే...ఇచ్చి పో... లేకుంటే నడు, బొక్కలో తోస్తా నీ...' బెదిరింపు స్వరం.

" చాలురా దేవుడోయి ఇద్గో దొరా ఇగపోతా"

"పో గానీ మళ్ళా కనబడకు గిట్లనే... మంచిగుండది'

"అట్లనే దొరా" పీడా వదిలిందనే సంతోష స్వరం.

ఒంటికి తగిలిన దెబ్బలతో, కడుపులో ఆకలి, ఇంట్లో భార్యా బిడ్డలకు ఇంత గంజినీళ్ళుపోయడానికొచ్చిన పది రూపాయలు పోగొట్టుకున్న బాధలన్నీ ఒక్కసారి మనస్సులో మెదిలి నీళ్ళరూపంలో కంట్లోంచి వచ్చేశాయి కరీంకు.

చౌరస్తాలో ప్రొద్దున్నుంచి చూసి చూసి విసిగిపోయిన కరీంకు దొరికన మొదటి సవారీ కూడా ఈ విధంగా పోయింది.



మరో రిక్షాలో ఆ అమ్మ వెళ్ళిపోవటం చూసి మరింత వ్యథ చెందాడు.

ఉన్న పది రూపాయలూ పోయినై, వస్తాయనుకున్న మరో మూడో, ఐదో కూడా పోయినై...

పోతే పోయినై, బొక్కలో పడి చావటం తప్పించుకున్నాడు కరీం. అల్ప సంతోషం రెపరెపలాడింది కళ్ళల్లో.

ఆలోచిస్తూ రిక్షా లాగుతున్న కరీంకు మంత్రి గారొస్తున్న సందర్భంగా రోడ్డు మీద రెండు డ్రమ్ముల సాయంతో కొబ్బరి ఆకులతో కట్టిన స్వాగత తోరణం ఎదురుపడి వెక్కిరించింది.

"ఎవడొస్తున్నాడూ?" మూడవ తరగతిలోనే వదిలేసిన చదువు ఇప్పుడు ఇలా పనికొస్తోంది కరీంకు. తెల్లటి బట్టమీద నీలి రంగుతో రాసిన అక్షరాల్ని చదవడానికి కష్టపడుతున్నాడు.

"రిక్షా కార్మికుల కన్నీళ్ళు తుడిచి, ఇళ్ళ పట్టాల పంపిణీకై విచ్చేస్తోన్న పేదల పెన్నిధీ, పేదలదేవుడూ, రిక్షా కార్మిక బంధువు శ్రీ శ్రీ ఫలానా మంత్రిగార్కి ఘనస్వాగతం"

"థూ...నీయవ్వ" గాండ్రించి 'ఉమ్మేశాడు కరీం.

"రిక్షావాడి పొట్టగొడ్తే కానేవాళ్ళు లేరుగానీ పట్టాలిస్తరంట..." కరీంకు కోపం వచ్చేసింది.

అయితేనేం? పేదవాడి కోపం పెదవికి చేటు ఈ లోకంలో.

"నీకెంత కోపం వచ్చినా నన్నేం చేయలేవు. నేను నేనే' అన్నట్లు హేళనగా రెపరెపలాడింది తోరణం.

రోడ్డు నిండా ఇలాంటివే మరో ఐదారు తోరణాలు. అక్కడక్కడా ట్రాఫిక్ జామ్ అవుతోంది.

మరిచిపోలేక మరో సవారీ దొరుకుతుందేమో అన్న ఆశ కరీంను రైల్వే స్టేషన్ వైపు లాక్కెళ్ళింది. జీవితాన్ని లాగేందుకు.

"యే జిందగీ ఎక్ సఫర్ హై. ఓ ముసాఫిర్" రైల్వే స్టేషన్ వద్ద హోటల్‌లోని ట్రాన్సిస్టర్‌లో మహ్మద్ రఫీగారి కంఠం విన్పిస్తోంది తీయగా.

సూర్యుడు కక్కుతున్న నిప్పుల్ని కాసేపు చల్లవరిచాడు మబ్బుల చాటున దాక్కుని కరీంకు సాయంగా, నేను చేయగలిగిన సాయం ఇదే అన్నట్లుగా.

అరుణ చైతన్యగోఖలే
కేరాఫ్ః మా.రా.గోఖలే
కమ్మర్‌పల్లి-503 308.